క్లుప్తంగా

చేతి శుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం



హ్యాండ్‌వాష్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం రూరల్: ప్రతి రోజూ చేతులు శుభ్రం చేసుకుని, ఆహారం తింటే సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని శాటిలైట్ సిటీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.రాజరాజేశ్వరి అన్నారు. గురువారం ఆ స్కూల్లో మ్యాజిక్ బస్ ఆధ్వర్యంలో గ్లోబల్ హ్యాండ్ వాషింగ్ డే నిర్వహించారు. హెచ్ఎం రాజ రాజేశ్వరి మాట్లాడుతూ తమ పాఠశాల 7, 8వ తరగతి పిల్లలకు న్యూట్రిషన్, హెల్త్ అండ్ ఫిట్‌నెస్, పర్సనల్ హైజిన్ వాటిపై అవగాహన కల్పిస్తున్న మ్యాజిక్ బస్ నిర్వాహకులను అభినందించారు.

సంతకాల సేకరణ

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక కోటగుమ్మం సెంటర్‌లోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో గురువారం సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ మాట్లాడుతూ పెరిగిన విద్యుత్ చార్జీలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

మిషన్ అంత్యోదయ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రత్నకుమారి

కడియం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కె.రత్నకుమారి అధ్యక్షతన గురువారం మిషన్ అంత్యోదయ అవగాహన సమావేశం నిర్వహించారు. సర్వేయర్లు సేకరించిన భౌతిక ఆస్తులకు సంబంధించి జియో ట్యాగ్ చేసిన డేటాను పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. రీవెరిఫికేషన్ అనంతరం సేకరించిన డేటాను మాత్రమే అప్‌లోడ్ చేయాలని వివరించారు. మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తమకు నిర్దేశించిన ఆదేశాల మేరకు మిషన్ అంత్యోదయ కార్యక్రమం విజయవంతమయ్యేలా కృషి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ వైవీవీఎంఎస్ లక్ష్మి, ఎంఈవో వి.లజపతిరాయ్, ఇంజినీరింగ్ అధికారి సీహెచ్ త్రిమూర్తులు పాల్గొన్నారు.

నర్సరీల సందర్శన

కడియం: కడియం ప్రాంత నర్సరీలను తమిళనాడుకు చెందిన ఉద్యానశాఖ అధికారుల బృందం గురువారం సందర్శించింది. కడియపులంకలోని పుల్లా ఆంజనేయులకు చెందిన సత్యదేవ నర్సరీకి విచ్చేసిన వారికి నర్సరీ రైతు పుల్లా రాజశేఖర్ పలు అంశాలను వివరించారు. జిల్లా ఉద్యాన అధికారి బి.సుజాత, జయలక్ష్మి తదితరులు ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం



కడియంలో కేంద్రాన్ని ప్రారంభిస్తున్న గిరజాల బాబు. చిత్రంలో ఈలి గోపాలం

కడియం: మండలం పరిధిలో వరిసాగు చేసే గ్రామాల్లో గురువారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కడియంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు, కడియం మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఈలి గోపాలం తదితరులు పాల్గొన్నారు. కడియపుసావరం, మాధవరాయుడు పాలెం గ్రామాల్లో ఏర్పాటు చేసిన కేంద్రాలను ఎంపీడీవో కె.రత్నకుమారి ప్రారంభించారు. జేగురుపాడులో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, సర్పంచ్ సతీష్ చంద్ర స్టాలిన్ ప్రారంభించారు. కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.సుజాత పాల్గొన్నారు.

మద్యం విక్రేత అరెస్టు

రాజమహేంద్రవరం రూరల్: కోలమూరులో మద్యం అక్రమంగా విక్రయిస్తున్న బాలిన నరసింహమూర్తిని ఎస్ఈబీ స్పెషల్ టీమ్ ఇన్‌స్పెక్టర్, సిబ్బందితో కలిసి అరెస్టు చేశారు. అతడి నుంచి 180ఎంఎల్ ఎనిమిది మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఈబీ నార్త్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పీవీ రమణ తెలిపారు.

మాదక ద్రవ్యాలతో అనర్థాలు

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం ఏపీ పేపరుమిల్లు ప్రైమరీ అండ్ హైస్కూల్ విద్యార్థులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. మాదకద్రవ్యాలు – వాటి వల్ల కలిగే అనర్థాలను ఎస్ఈబీ నార్త్ ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ పీవీ రమణ వివరించారు. హైస్కూల్ హెచ్ఎం శ్రీనివాసమూర్తి, నార్త్ ఎస్ఈబీ ఎస్సై బి.అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య మెరుగుకు ప్రత్యేక శ్రద్ధ

- అధికారుల చర్యలు
- ధవళేశ్వరంలో చురుగ్గా పనులు
- ప్రజలు, వ్యాపారులకు అవగాహన



ధవళేశ్వరంలో జరుగుతున్న చెత్త తొలగింపు పనులు

ధవళేశ్వరం: గ్రామంలో పారిశుధ్య నిర్వహణను గాడిన పెట్టే విధంగా పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తున్నారు. అదనపు సిబ్బందిని విధుల్లోకి తీసుకొని పనులు చేయిస్తున్నారు. దీంతో పలు ప్రాంతాల్లో పారిశుధ్యం నిర్వహణ మెరుగైంది. గ్రామంలో పూర్తిస్థాయిలో పారిశుధ్యం మెరుగుపడేలా సహకరించాలని ప్రజలను పంచాయతీ అధికారులు కోరుతున్నారు. బహిరంగ ప్రదేశాలు, కాలువల్లో చెత్తను వేయవద్దని పంచాయతీ అధికారులు సూచిస్తున్నారు. సమష్టి భాగస్వామ్యంతో గ్రామంలో పూర్తి స్థాయిలో పరిశుభ్రత సాధ్యమవుతుందన్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే ధవళేశ్వరం మార్కెట్‌లో వ్యాపారులకు అవగాహన కల్పించారు. ప్రధాన రహదారిపై వ్యాపారులను స్వయంగా కలిసి బహిరంగ ప్రదేశాలలో చెత్త వేయవద్దని సూచించారు. ప్రతి రోజూ ఉదయం 6 నుంచి 7 గంటల వరకూ ప్రధాన రహదారిలో వ్యాపారుల వద్ద నుంచి చెత్త సేకరణ కార్యక్రమం చేపట్టారు. దీంతో గ్రామంలో పారిశుధ్యం చాలా మేరకు గాడిన పడింది.

అదనపు సిబ్బందితో పనులు

పంచాయతీ కార్మికులతో పాటు అదనపు సిబ్బందిని తీసుకొని గ్రామంలో పారిశుధ్య నిర్వహణ పనులను చేపట్టారు. కాలువల్లో పూడికతీత పనులకు పది మంది వడ్డెర కార్మికులను తీసుకున్నారు. రెండు జేసీబీలు, నాలుగు ప్రైవేట్ ట్రాక్టర్లతో గ్రామంలో పేరుకుపోయిన చెత్తను తొలగిస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి డి.సూరిబాబు ఈ పనులను పర్యవేక్షిస్తున్నారు.



పూడికతీత పనులను పర్యవేక్షిస్తున్న పంచాయతీ కార్యదర్శి సూరిబాబు



వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్న పంచాయతీ అధికారులు

ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తున్నాం



గ్రామంలో ప్రధాన సమస్యగా మారిన పారిశుధ్య నిర్వహణను గాడిన పెట్టేందుకు ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తున్నాం. అదనపు సిబ్బందిని ఏర్పాటు చేశాం. వ్యాపారులకు పలు సూచనలు చేశాం. త్వరలో రిక్షాల ద్వారా ఇంటింటా చెత్త సేకరణ కార్యక్రమం చేపట్టేందుకు చర్యలు చేపట్టాం.

– డి.సూరిబాబు, ధవళేశ్వరం పంచాయతీ కార్యదర్శి

వ్యర్థాలతో ఇక్కట్లు

ప్రధానంగా అనేక చోట్ల వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో వేస్తుండటం పంచాయతీ సిబ్బందికి, అధికారులకు తలనొప్పిగా మారింది. ఇళ్లలో పాడైపోయిన పరుపులు, సామానులు సైతం రోడ్డు పక్కన, చెత్త కుండీల్లో వేస్తున్నారు. వీటిని తొలగించడం తలకు మించిన భారంగా తయారైంది. మరో పక్క వ్యర్థాలను కాలువల్లో వేస్తుండటంతో మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోంది. కాలువల్లో పూడికతీత చేపట్టినా తిరిగి చెత్త వేస్తుండటంతో సమస్య మొదటికి వస్తోంది. చెత్తను బహిరంగ ప్రదేశాలలో, కాలువల్లో వేయకుండా సహకరిస్తే పారిశుధ్య నిర్వహణ మరింత మెరుగుపడే అవకాశం ఉంది.

సమస్యలకు సత్వర పరిష్కారం



పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న డాక్టర్ గూడూరి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించే లక్ష్యంతో నిరంతరం కృషి చేస్తున్నట్లు వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. స్థానిక 40వ డివిజన్‌లో నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన సమస్యలపై ఆయన ప్రత్యేక దృష్టి సారించారు. ప్రధానంగా కాలువల్లో పూడికతీతకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. గురువారం ఆ డివిజన్‌లోని పందిరి మహాదేవుడు, ఎన్టీఆర్ కాలనీల్లో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజలు తమ పరిసరాలను, వీధిని శుభ్రంగా ఉంచుకుంటే నగరమంతా శుభ్రంగా ఉంటుందన్నారు. డ్రైనేజీలో చెత్త పారబోయకుండా పారిశుధ్య కార్మికులకు అందించాలన్నారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, డివిజన్ ఇన్‌చార్జి దుంగ మంగాలక్ష్మి పాల్గొన్నారు.

అంధత్వ నివారణపై ప్రజలకు అవగాహన



మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు. చిత్రంలో డాక్టర్ అనసూరి పద్మలత

రాజమహేంద్రవరం రూరల్: కంటిచూపు లోపంతో బాధపడే వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతున్న ఈ నేపథ్యంలో దృష్టి లోపం, అంధత్వ నివారణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని జిల్లా వైద్య,ఆరోగ్య శాఖాధికారి (డీఎంఅండ్‌హెచ్‌వో) డాక్టర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. శాటిలైట్ సిటీ బి బ్లాకులోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో గురువారం ప్రపంచ దృష్టి దినోత్సవం (వరల్డ్ సైట్‌డే)పై అవగాహన కార్యక్రమాన్ని జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ ఏ.లావణ్య అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డీఎంఅండ్‌హెచ్‌వో మాట్లాడుతూ కళ్లకు ఎటువంటి వ్యాధులు సోకిన వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. డీబీసీ ప్రోగ్రాం మేనేజర్ లావణ్య మాట్లాడుతూ మీ కళ్లను ప్రేమించండి అనే థీమ్‌తో ఈ ఏడాది ప్రపంచ దృష్టి దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. వైఎస్సార్ సీపీ వైద్య విభాగం జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ అనసూరి పద్మలత మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ కంటి ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలన్నారు.

నాడు - నేడు రికార్డులు అప్‌డేట్‌గా ఉంచాలి

కంబాలచెరువు: నాడు– నేడు పనులు జరుగుతున్న పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రికార్డులను అప్‌డేట్‌గా ఉంచాలని అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్ ఆదేశించారు. స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అర్బన్ పరిధిలోని ప్రభుత్వ, మునిసిపల్, ఎయిడెడ్ ఉన్నత, ప్రాథమికోన్నత ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమీక్షించారు. డీఐ మాట్లాడుతూ ఫేజ్ 1 పనులు పూర్తి అయి, ఇంకా బిల్స్ అప్‌లోడ్ కాని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వెంటనే వివరాలు తమ కార్యాలయంలో అందజేయాలన్నారు. ఫార్మేటివ్ 2 పరీక్షల మార్కులను సీఎస్ఈ వెబ్‌సైట్‌లో వెంటనే అప్లోడ్ చేయాలన్నారు. అర్బన్ ఎంఈఓ 2 రమారజని మాట్లాడుతూ ఉపాధ్యాయుల లెస్సన్‌ప్లాన్ ఒక ఫోల్డర్‌లో ఉండాలన్నారు. సీఆర్పీలు జయంతి శాస్త్రి, జె.శ్రీనివాసరావు, ఇందిర, కుమారి, నాగలక్ష్మి, కోటేశ్వరి పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడలకూ ప్రాధాన్యం

- డైట్ ప్రిన్సిపాల్ డాక్టర్ రమణ
- ముగిసిన రోల్ ప్లే, నృత్య పోటీలు



మాట్లాడుతున్న డైట్ ప్రిన్సిపాల్ రమణ

రాజమహేంద్రవరం రూరల్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకూ ప్రాధాన్యం ఇవ్వాలని డైట్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌డీవీ రమణ అన్నారు. బొమ్మూరులోని జిల్లా ప్రభుత్వ విద్యాశిక్షణా సంస్థ (డైట్)లో రెండు రోజులు నిర్వహించిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాస్థాయి రోల్‌ప్లే, జానపద నృత్య పోటీలు గురువారంతో ముగిశాయి. ఉమ్మడి జిల్లాలో 16 పాఠశాలల నుంచి విద్యార్థులు వీటిలో పాల్గొన్నారు. పోటీల విజేతలను డైట్ ప్రిన్సిపాల్ రమణ ప్రకటించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఎస్‌సీఈఆర్‌టీ ఇచ్చిన థీమ్స్ ప్రకారం ప్రజలను ఆలోచింపజేసేలా రోల్‌ప్లే ప్రదర్శనలు చేశారన్నారు. జానపద నృత్యాలు సైతం అందరిని అలరించాయన్నారు. వీటిలో ప్రథమస్థానాల్లో నిలిచిన వారు రాష్ట్రస్థాయి పోటీలకు హాజరుకావాలన్నారు.

విజేతలు వీరే..

రోల్‌ప్లే విభాగంలో కడియం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రథమ, బొమ్మూరు ఎంజేఏపీబీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ ద్వితీయ, కేశవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తృతీయ స్థానాల్లో నిలిచాయి. జానపద నృత్య పోటీల్లో బొమ్మూరు జీటీడబ్ల్యూఏజీ హైస్కూల్ ప్రథమ, ఎంజేఏపీబీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ ద్వితీయ, పసలపూడి ఎస్‌సీహెచ్ఎస్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తృతీయ స్థానాలు సాధించాయి.

సుస్వాగతం..





కాకినాడ జిల్లా సామర్లకోట ఈటీసీ లేఅవుట్‌లోని జగనన్న కాలనీలో పూర్తయిన ఇళ్లకు గృహ ప్రవేశాలు చేసి రాష్ట్ర వ్యాప్త కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. తాడేపల్లి నుంచి హెలికాప్టర్‌లో సామర్లకోట వచ్చిన ఆయనకు ఎంపీ భరత్ రామ్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు, రుడా మాజీ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి స్వాగతం పలికారు.

ఉత్సాహంగా స్వచ్ఛతా ఫ్రీడమ్ రన్



దండిమార్చ్ విగ్రహాల వద్ద విద్యార్థినులు

కంబాలచెరువు: స్థానిక గోకవరం బస్టాండ్ వద్ద ఉన్న రాజమహేంద్రి కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ 1, 2 ఆధ్వర్యంలో ఫిట్ ఇండియా స్వచ్ఛత ఫ్రీడం రన్ 4.0 గురువారం నిర్వహించారు. దీనిని కళాశాల ప్రిన్సిపాల్ తేతలి సత్య సౌందర్య జెండా ఊపి ప్రారంభించారు. కళాశాలలోని 150 మంది ఎన్ఎస్ఎస్, యూత్ రెడ్ క్రాస్ వలంటీర్లు పాల్గొన్నారు. కళాశాల దగ్గర ప్రారంభమైన రన్.. తుమ్మలావ, రామచంద్రరావు పేట, జయరాం నటరాజ్ థియేటర్ల రోడ్డు, ట్రంక్ రోడ్డు మీదుగా కంబాల చెరువు సమీపంలోని దండి మార్చ్ విగ్రహాల వద్ద ముగిసింది. ప్రిన్సిపాల్ తేతలి సత్య సౌందర్య మాట్లాడుతూ ప్రధానమంత్రి మోదీ ఇచ్చిన పిలుపు మేరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ పీవోలు ఎస్‌వీ.సుధారాణి, ఎంకేఎస్ ప్రసాద్, వెంకట్, వీరస్వామి పాల్గొన్నారు.

బైకుల దొంగ అరెస్ట్

- 11 మోటారు సైకిళ్లు స్వాధీనం
- దొంగ సొత్తు కొన్న మరో ఐదుగురు జైలుకి



మీడియాతో మాట్లాడుతున్న డీఎస్పీ జయపాల్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): దొంగతనం చేసిన వ్యక్తి వ్యక్తితో పాటు ఆ సొత్తు కొన్న మరో ఐదుగురికి అరెస్టు చేసి జైలుకు పంపారు రాజమహేంద్రవరం పోలీసులు. సెంట్రల్ జోన్ డీఎస్పీ కె.జయపాల్ గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ వివరాలు వెల్లడించారు. స్థానిక గోదావరి గట్టు, ఇసుక ర్యాంపు సమీపంలో ఒకటో పట్టణ పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో పీవీ నర్సింహారావు పార్క్ వైపు నుంచి వస్తున్న తాళ్లపూడి గ్రామం, గౌరుసు వీధికి చెందిన కర్రి సాయికుమార్ పోలీసులను చూసి వెనక్కి తిరిగి పారిపోతున్నాడు. దీన్ని చూసిన పోలీసులు అతనిని వెంటనే పట్టుకున్నారు. అతనిని విచారించగా గడచిన రెండేళ్లలో సాయికుమార్ దొంగిలించిన మోటారు సైకిళ్ల వివరాలు రాబట్టారు. త్రీటౌన్, వన్‌టౌన్, ప్రకాష్ నగర్, అనపర్తి, కొవ్వూరు, ధవళేశ్వరం, విజయవాడ పోలీస్ స్టేషన్ల పరిధిలో అతను దొంగిలించిన మొత్తం 11 మోటార్ సైకిళ్ల వివరాలు తెలిపాడు. వాటిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దొంగిలించిన ద్విచక్ర వాహనాలను తాళ్లపూడి మండలం వేగేశ్వరపురానికి చెందిన అంకోడు నాగ దుర్గ ప్రసాద్, కాళ్ళ అనంత మోహన్ కుమార్, కాళ్ళ శివ ప్రసాద్, మల్లిపూడికి చెందిన మహ్మద్ అబ్దుల్‌ఖాజా, నిడదవోలు మండలం కలవచెర్లకు చెందిన ముప్పిడి సత్యనారాయణలకు అమ్మాడు. దొంగసొత్తు అని తెలిసి వాటిని కొనుగోలు చేసిన వారిని పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.3 లక్షలు విలువైన 11 మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పట్టుకోవడంలో కృషి చేసిన ఎస్సై జె.ఆదినారాయణ, హెడ్ కానిస్టేబుల్ కె.సురేష్, ఎమ్.రాజశేఖర్ వర్మ, ఎమ్‌వీ.దుర్గారావు, కానిస్టేబుళ్లు పి.శ్రీను, ఎస్‌కే ఎ.షరీఫ్, ఎమ్.స్వామిలను ఎస్పీ పి.జగదీష్ అభినందించారు.

14న గాడాలలో మహా శాంతి హోమం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చిన్న వెంకన్నబాబు స్వామీజీ తదితరులు

సీటీఆర్ఐ: అనేక దోషాల నివారణ కోసం ఆచరించే 11 నెలల కార్యక్రమంలో భాగంగా శనివారం గాడాలలోని మహాలక్ష్మీ సమేత చిన్న వెంకటేశ్వరస్వామి పీఠంలో మహాశాంతి హోమం నిర్వహిస్తున్నామని పీఠాధిపతి చిన్న వెంకన్నబాబు స్వామీజీ అన్నారు. దానవాయిపేటలోని ట్రస్టు కార్యాలయంలో గురువారం ఈ కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ పొన్నలూరి శ్రీనివాస గార్గేయ ఆధ్వర్యంలో ఆ రోజు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ హోమం జరుగుతుందన్నారు. ఆ తర్వాత పొన్నలూరి శ్రీనివాస గార్గేయకు సర్వేజనా సుఖినోభవంతు చారిటబుల్ ట్రస్ట్, మనగుడి – మనసేవ భారతీయ ఆధ్యాత్మిక సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో పంచాంగ రాజహంస సేవా పురస్కార్ అందజేస్తామన్నారు. భక్తులు తరలివచ్చి తీర్థప్రసాదాలు స్వీకరించాలన్నారు. కార్యక్రమంలో పీఠం ఉభయ రాష్ట్రాల చైర్మన్ మాతల రమేష్, రాష్ట్ర చైర్మన్ అంబటి శ్రీనివాస్, గౌరవ సలహాదారు సుమేధ రాజు, భాష్యం జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రవి కుమార్, శశి జూనియర్ కళాశాల ఏవో ఆకుల కిషోర్ పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షతో ఇంటి ముంగిటకే వైద్యం



ఇన్నీసుపేటలో వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి నాగేంద్ర

రాజమహేంద్రవరం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన జగనన్న ఆరోగ్య సురక్షతో పేదల ఇంటి ముంగిటకే మెరుగైన వైద్యం అందుతోందని అసిస్టెంట్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్ అన్నారు. శాటిలైట్ సిటీ గ్రామ సచివాలయం1 పరిధి బిబ్లాకులోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గురువారం నిర్వహించిన వైద్యశిబిరాన్ని ఆయన పరిశీలించారు. ప్రజలకు అందిస్తున్న వైద్యసేవలపై ఆరా తీశారు. అలాగే శిబిరాన్ని డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ వైద్యవిభాగం అధ్యక్షురాలు డాక్టర్ అనసూరి పద్మలత పరిశీలించారు. శిబిరంలో 515 మందికి వైద్యసేవలు అందించగా, 42 మందిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రిలకు రిఫరల్ చేయడం జరిగింది. తహసీల్దార్ పైడి చిన్నారావు, పంచాయతీ కార్యదర్శి తాడి కృష్ణ, సచివాలయ కన్వీనర్లు మీగడ గంగాధర్, చిలుకూరి మనోహర్, మాజీ సర్పంచ్ రుంకాని రమణమ్మ, మాజీ ఉపసర్పంచ్ బొమ్ము శ్రీను, గ్రామ పార్టీ అధ్యక్షుడు సఫారి నాయుడు పాల్గొన్నారు.

ఇన్నీసుపేటలో..

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, రూరల్ నియోజకవర్గ డివిజన్ల క్లస్టర్ ఇన్‌చార్జి మింది నాగేంద్ర అన్నారు. ఇన్నీసుపేటలోని యూపీహెచ్‌సీలో గురువారం నిర్వహించిన వైద్యశిబిరాన్ని సచివాలయ కన్వీనర్లతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం మింది నాగేంద్ర, పార్టీ జిల్లా కార్యదర్శి కొప్పిశెట్టి రాజమౌళి, ఇన్నీసుపేట బ్యాంకు వైస్ చైర్మన్ అన్నపూర్ణ రాజు, సబ్బెళ్ల విజయ దుర్గారెడ్డి, కృష్ణారెడ్డి, వంశీ తదితరులు మందుల కిట్లు పంపిణీ చేశారు. అసిస్టెంట్ కలెక్టర్ యశ్వంత్ కుమార్ వైద్యశిబిరాన్ని సందర్శించారు. 721 మంది వైద్యసేవలందించగా, 45మందిని ఆరోగ్యశ్రీనెట్‌వర్క్ ఆసుపత్రిలకు సిఫారసు చేశారు.

మూడోదశ రీసర్వే ప్రక్రియపై శిక్షణ

- సిబ్బందికి పూర్తిస్థాయి అవగాహన
- కలెక్టర్ మాధవీలత వెల్లడి



వీసీలో పాల్గొన్న కలెక్టర్ మాధవీలత, జేసీ తేజ్ భరత్



మోరంపూడి జంక్షన్‌లో గాయపడిన మహిళ, ఘటనా స్థలంలో కలెక్టర్ మాధవీలత, జేసీ తేజ్ భరత్

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): మూడోదశ రీసర్వే ప్రక్రియను సజావుగా పూర్తి చేసేందుకు క్షేత్రస్థాయి అధికారులకు, సిబ్బందికి శిక్షణ ఇచ్చామని, తొలి రెండు దశల్లో ఎదుర్కొన్న పలు అంశాలపై అవగాహన కల్పించామని కలెక్టర్ మాధవీలత అన్నారు. రెవెన్యూ రీసర్వే, జాతీయ రహదారులు, వ్యవసాయం, పీఆర్‌లో ప్రాధాన్యత భవనాలు, ఉపాధి హామీ తదితర అంశాలపై గురువారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ రెడ్డి విజయవాడ క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి కలెక్టర్ మాధవీలత, జేసీ ఎస్.తేజ్ భరత్, ఇతర అధికారులు పాల్గొన్నారు. కలెక్టర్ మాధవీలత జిల్లా ప్రగతిపై వివరాలు తెలియచేస్తూ ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్లలో భాగంగా 48,378 ఇళ్లకు ప్రతిపాదనలకు గాను ఈ నెలలో 3,677 లక్ష్యం ఇచ్చామన్నారు. జల్ జీవన్ మిషన్ 404 పనులకు సంబంధించి రూ.164.34 కోట్లకు గాను ఇప్పటి వరకు రూ.48.21 కోట్లు ఖర్చు చేయడం జరిగిందన్నారు. 373 సచివాలయ భవనాలకు 280, 347 ఆర్బీకేలకు 231, 258 వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లకు 135 పూర్తి చేశామన్నారు. సరిహద్దు రాళ్ల ఏర్పాటు కోసం 100 గ్రామాల్లో 1,13,683కి ప్రతిపాదనలు పంపామన్నారు.

నియామక పత్రాలు అందజేత

రాజమహేంద్రవరం రూరల్: కొవ్వూరు డివిజన్‌కు ఏపీపీఎస్సీ గ్రూప్ –4 లో నియమించిన ఐదుగురు జూనియర్ అసిస్టెంట్ అండ్ టైపిస్టులకు గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లో కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత నియామక పత్రాలు అందజేశారు. పెద్ద మణికంఠ నందిన (పెరవలి), తానేటి సింధూరాణి (కొవ్వూరు), షేక్ రెహాంజ్ బేగం (నిడదవోలు రూరల్), భూక్యా అశ్వంత్‌నాయక్(నల్లజర్ల), నల్లబాయి వేద కుమారి (ఉండ్రాజవరం) నియమితులయ్యారు.

ప్రమాద ఘటనపై స్పందించిన కలెక్టర్, జేసీ

ప్రమాదవశాత్తూ బైక్‌పై నుంచి పడిపోయి గాయపడిన మహిళకు వైద్యసాయం అందేలా కలెక్టర్ మాధవీలత, జేసీ తేజ్ భరత్ చర్యలు తీసుకున్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కేశవరానికి చెందిన రాయపాటి సుశీల, ఆమె కుమారుడు మణికంఠతో కలిసి మోటార్ బైక్‌పై వెళుతూ మోరంపూడి జంక్షన్‌లో గురువారం మధ్యాహ్నం 2.45 గంటల సమయంలో పడిపోయారు. కొవ్వూరు మండలం కాపవరంలోని వైఎస్సార్ జగనన్న కాలనీలో గృహప్రవేశాలకు హాజరైన కలెక్టర్, జేసీలు అప్పుడే తిరిగి కలెక్టరేట్‌కు వస్తున్నారు. మోరంపూడి జంక్షన్‌లో ప్రమాద సంఘటన చూసిన వెంటనే కలెక్టర్ మాధవీలత కారును నిలుపదల చేయించి గాయపడిన మహిళ వద్దకు చేరుకుని ధైర్యం చెప్పారు. జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్ 108కు ఫోన్ చేశారు. గాయపడిన సుశీలను 108లో నగరంలోని సాయి ఆసుపత్రికి తీసుకువెళ్లి మెరుగైన వైద్యసేవలందించేల చర్యలు తీసుకోవాలని అంబులెన్స్ సిబ్బందిని ఆదేశించారు. ప్రస్తుతం సుశీల సాయి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.